ప్రజాశక్తి
బుధవారం 17 డిసెంబర్ 2025
5
విజయనగరం



శిశుగృహాన్ని సందర్శించిన ఐసిడిఎస్ పీడీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని కెఎల్‌పురంలోని శిశు గృహాన్ని ఐసిడిఎస్ పీడీ టి.విమలా రాణి మంగళవారం సందర్శించారు. ఈ శిశు గృహంలో అనాథ, వదిలివేయబడిన, అప్పగించబడిన పిల్లలు ఆశ్రయం పొందుతున్నారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. 0 నుండి 6 ఏళ్లలోపు పిల్లలు ఈ శిశు గృహంలో ఉంటారని, వీరిని పిల్లలు లేని తల్లిదండ్రులకు చట్టపరంగా దత్తత ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం శిశు గృహంలో నలుగురు పిల్లలు ఆశ్రయం పొందుతున్నారని చెప్పారు. అంగన్ వాడీ వర్కర్ ఈ పిల్లల బరువు తూయించి ఎంసిపి కార్డులో గ్రోత్ ప్లాటింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం మహారాణి పేటలో గల బాలసదనం సందర్శించారు. పిల్లలను జాగ్రతగా చూడాలని పర్యవేక్షకులను ఆదేశించారు.

భూమీ లేదు... పార్కూ రాదు

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పేరుతో 172.84 ఎకరాలు ధారాదత్తం
- ఒక్క అడుగూ ముందుకు వేయని పతంజలి సంస్థ
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



పతంజలి సంస్థకు కేటాయించి భూములు

నోరు విప్పితే పారిశ్రామికాభివృద్ధి జపం చేస్తున్న ప్రభుత్వం రూ.కోట్ల విలువ చేసే భూములను కార్పొరేట్, ప్రైవేటు సంస్థలకు దారాదత్తం చేస్తోంది. ఆయా భూముల్లో పరిశ్రమలు మాత్రం రావడం లేదు. దీంతో, కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్టు, కొత్త పరిశ్రమలు రావడం లేదు సరికదా ఇప్పటికే ఆయా భూములపై జీవనోపాధి పొందుతున్నవారు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్తున్నారు. పతంజలి ఫుడ్ పార్కు పేరిట కేటాయించిన భూమి ఇందుకు ఉదాహరణగా చెప్పకోవచ్చు. విశాఖపట్నం కేంద్రంగా ఇటీవల జరిగిన పారిశ్రామిక సమ్మిట్, విశాఖ ఎకనమిక్ రీజియన్ (విఇఆర్) సమావేశం నేపథ్యంలో పంతంజలి పార్కు, దానికి కేటాయించిన భూమి సర్వత్రా చర్చ ప్రారంభమైంది.

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చినరావుపల్లి వెరెన్యూ పరిధిలోని 172.84 ఎకరాల భూమిని ఫుడ్ పార్కు పేరుతో 2017 ఫిబ్రవరి 28న అప్పటి టిడిపి ప్రభుత్వం పతంజలి సంస్థకు కట్టబెట్టిన సంగతి విధితమే. నాటికి చాలా కాలం ముందునుంచే ఈ భూమిలో జీడి, మామిడి వంటి చెట్లు, మొట్ట పంటలు సాగుచేస్తూ సుమారు వందమందికిపైగా దళితులు, గిరిజనులు, బిసిలు జీవనసం సాగిస్తుండే వారు. ఈనేపథ్యంలో పంతంజలికి భూమిని కట్టబెట్టడానికి వ్యతిరేకంగా అప్పట్లో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. కేవలం బాధితులే కాకుండా వామపక్షాలు, పలు ప్రజాసంఘాల నాయకులు వారికి మద్దతుగా నిలిచారు. అయినప్పటికీ నాటికి ఎకరా రూ.20లక్షలు పలికే భూమిని, రూ.3లక్షలకు కట్టబెట్టారు. ఇదేమంటే ఈ మెగా ఫుడ్ పార్కు ద్వారా 6వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం.... 2021నాటికి ఈ పార్కును అందుబాటులోకి తెస్తామని కూడా ఆ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. తీరా భూమి కేటాయింపు చేసుకున్న తరువాత పార్కు నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. దీంతో, ఉన్న ఉపాధి పోయింది, కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాకుండా పోయాయి. ఈనేపథ్యంలో పేదలైన దళిత, గిరిజన, బలహీనవర్గాల వద్ద తీసుకున్న భూములు వెనక్కి అప్పగించడంతో పాటు నిబంధనల ప్రకారం పార్కును ఏర్పాటు చేయలేకపోయినందుకు పతంజలి సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని ఇఎఎస్ శర్మ డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు భూములు కోల్పోయిన పేదలు కూడా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఫుడ్ పార్కుపేరుతో భూములు తీసుకుని, ఏర్పాటుకు ముందుకు రాని పతంజలి సంస్థపైనా, అందుకోసం కారు చౌకగా భూమి కట్టబెట్టిన ప్రజాప్రతినిధులు, అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి (ఐఎఎస్) ఇఎఎస్ శర్మ గతంలో డిమాండ్ చేయడంతో ప్రభుత్వ వ్యవహారం రచ్చకెక్కింది. ఇప్పటికైనా దీన్ని వినియోగంలోకి తేవడం లేదా పేదలైన దళితులు, గిరిజనులు, వెనుకబడి తరుతులకు తిరిగి అప్పగించాలనే డిమాండ్ పెరుగుతోంది.

ఉపాధి చట్టం రద్దు కుట్రలను తిప్పికొట్టాలి

- వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు
- చట్టం పేరు మార్పు జీవో ప్రతులు దహనం



ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కూలీల పొట్టకొట్టేందుకు ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని, ఈ కుట్రలను కూలీలంతా తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టం పేరు మారుస్తూ కేంద్రప్రభుత్వం చేసిన చటాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం మండలంలోని వెంకు నాయుడు బంద వద్ద ఉపాధి కూలీలంతా నిరసన తెలిపారు. చట్టం రద్దు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఉపాధి హామీ చట్టం పేరును మార్చుతూ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ పేరిట చట్టం చేసిందని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు చట్టంలో అనేక మార్పులు చేస్తూ వచ్చిందన్నారు. రెండు పూటలా పని పెట్టడం, నెలల తరబడి కూలి చెల్లించకుండా కాలయపాన చేయడం, ఫేస్ యాప్ పెట్టడం, పనిముట్లకు చెల్లించే అలవెన్సులకు కోతపెట్టడం వంటి నిబంధనలు తెచ్చిందన్నారు. దేశ అభివృద్ధికి మూలమైన కార్మిక వర్గాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదన్నారు. ఉపాధి హామీ చట్టానికి ఏడాదికి 2.50లక్షల కోట్లు కేయించాల్సి ఉండగా, కేవలం రూ.80వేల కోట్లు మాత్రమే కేటాయిస్తోందన్నారు. కేటాయించిన నిధుల్లో పది శాతం మాత్రమే మెటీరియల్ కాంపోనెంట్ పనులకు ఖర్చు చేయాల్సి ఉండగా, ఆ నిధులను దారి మళ్లించి 40శాతం వినియోగిస్తోందని అన్నారు. కార్మిక కుటుంబంలో ఏడాదిలో 200రోజులు పని దినాలు కల్పించి రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేస్తుంటే ఉపాధి చట్టం పేరు మార్పు చేసి పేదలను పనికి దూరం చేయాలని చూస్తోందని అన్నారు. గ్రామీణ పేదలు వలస పోకుండా నివారించాలని, పని అడిగిన 15రోజులకు పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గిరిజన సాగు భూముల పరిశీలన

ఎస్.కోట మండలంలోని కొండమల్లి పూడి గ్రామ గిరిజనుల సాగు భూములను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పరిశీలించారు. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలో 1996, 2023-24లో అప్పటి ప్రభుత్వాలు ఆదివాసి గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇచ్చాయి. వాటికి పట్టాలు కూడా మంజూరు చేసింది. గిరిజనులంతా తమ పూర్వీకుల నుంచి ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నారు. అయితే ఆ భూముల్లో ఆదివాసీలు లేరని చెప్పి, ప్రైవేటు భూమిగా నమోదు చేశారని, ఇది సరైనది కాదని సుబ్బారావు అన్నారు. ఆ భూముల్లో ఆదివాసీలు సాగులో ఉంటే లేరని తప్పుడు ఎండాస్మెంట్ రిపోర్ట్ రెవెన్యూ అధికారులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనిపై భవిష్యత్తులో పోరాటం చేపడతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, ఆనంద్, శ్రీను, మీనా తదితరులు పాల్గొన్నారు

సిబిఎస్‌సి తరహాలో ఇంటర్ పరీక్షలు

ఇంటర్ బోర్డు రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ మోహన్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న మార్చిలో జరుగనున్న ఇంటర్ పరీక్షలను ఎటువంటి లోపాలకు తావివ్వకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు రిసోర్స్ పర్సన్, ప్రొఫెసర్ ఎన్.మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం తోటపాలెంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణపై వివిధ యాజమాన్యాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి శివ్వాల తవిటినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మారిన సిలబస్, ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్షల విధానాలను వివరించారు.2025-26 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరానికి సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల్లో (లాంగ్వేజ్‌లు మినహా) 14 సబ్జెక్టులకు నూతన సిలబస్ అమలులోకి వచ్చిందని, ప్రశ్నపత్రాలు పూర్తిగా సిబిఎస్ఇ తరహాలో రూపొందించడం జరుగుతుందని తెలిపారు. బోటనీ, జువాలజీని బయాలజీగా కలపడం, గణితాన్ని ఒకే ప్రశ్నపత్రంగా ప్రవేశపెట్టడం, సైన్స్ పేపర్లు 6 నుంచి 5కు తగ్గించడం వంటి సంస్కరణలను వివరించారు. సిలబస్ మారిన 14 సబ్జెక్టులకు 32 పేజీల సమాధాన బుక్లెట్లు, బోటనీ, జువాలజీకి 24 పేజీల బుక్లెట్లు అందించాలన్నారు. ఈ ఏడాది నుంచి పబ్లిక్ పరీక్షలు 30 రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిఒలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రశ్నపత్రాల భద్రత, తరలింపు ప్రక్రియలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. డివిఇఒ శివ్వాల తవిటినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల నేపథ్యంలో అధ్యాపకులు మారిన సిలబస్, పరీక్షల విధానాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో 66 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఎం. సత్యనారాయణ, ఎన్.ఎల్.వి జగన్నాథరావు, కె. అప్పారావు, పిఎల్ ఎన్ ప్రకాష్ పట్నాయక్, వికెవి కృష్ణారావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి : జెసి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పర్యావరణ పరిరక్షణ కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేథు మాధవన్ ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జెసి సేథుమాధవన్ అధ్యక్షతన మంగళవారం తన ఛాంబర్‌లో జరిగింది. జిల్లాలోని మున్సిపల్ ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నాలుగు మున్సిపాల్టీల్లో తీసుకున్న చర్యలను కమిటీ కన్వీనర్, విజయనగరం కమిషనర్ పి.నల్లనయ్య వివరించారు. అనంతరం జెసి మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మొదటిసారి జరిమానా విధించడంతోపాటు, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. రెండో సారి కూడా దొరికితే జరిమానా భారీగా విధించాలని, అవసరమైతే ట్రేడ్ లైసెన్సు రద్దు లాంటి చర్యలను కూడా తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు తయారుచేస్తే, ఆ కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు పి.నల్లనయ్య, ఎ.రామ చంద్రరావు, ఎల్.రామలక్ష్మి, జనార్ధనరావు, పర్యావరణ ఇంజినీర్ సరిత, పరిశ్రమల శాఖ మేనేజర్, ఇతర శాఖల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌర సేవలను మెరుగుపరచాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పౌర సేవలను మరింత మెరుగుపరిచి సచివాలయాల ఔన్నత్యాన్ని పెంచే దిశగా కృషి చేయాలని సచివాలయ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం 28, 29 నెంబర్ల సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూమెంట్ రిజిస్టర్ లను, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సేవలను మెరుగుపరచడంతో పాటు, ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎఇ సీతారామమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై 18న యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టెట్ నుంచి సీనియర్ ఉపాధ్యాయులను మినహాయించాలని, 100రోజుల కార్యాచరణలో పండగ, ఆదివారాలను మినహాయించాలని, సింగిల్ టీచర్ పాఠశాలలు,సెలవులు, మెగా పిటిఎం పాఠశాల నిధులు విడుదల తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు తెలిపారు. 2011 ముందు నియామకమైన ఉపాధ్యాయులందరూ 2ఏళ్లలోపు టెట్ పాస్ కావాలని, లేకుంటే ఉద్యోగ విరమణ చేయవలసి ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పుపై ఎస్‌టిఎఫ్ఐ గా రివ్యూ పిటిషన్ వేసామని. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. విద్యాశాఖ అధికారులు పదవ తరగతి పిల్లలకు 100 రోజులు కార్యాచరణలో క్రిస్టమస్, మహాశివరాత్రి, ఆదివారాల్లో తరగతులు నిర్వహించడం, స్లిప్ టెస్టులను ఏరోజుకారోజు అప్‌లోడ్ చేయమనడం వంటి నిర్ణయాలను సవరించాలని డిమాండ్ చేశారు. 3.0 మెగా పిటిఎం పాఠశాల నిధులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి తలపెట్టిన ధర్నాను ఉపాధ్యాయులంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కబ్జాదారుల నుంచి గుర్లగెడ్డ ప్రాజెక్టును కాపాడాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు • ఆక్రమిత కాలువ భూమి పరిశీలన

ప్రజాశక్తి-మెంటాడ



నిరసన తెలుపుతున్న పోరాట కమిటీ నాయకులు

భూ కబ్జాదారుల నుంచి గుర్లగెడ్డ ప్రాజెక్టును కాపాడాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. ఇటీవల రిజర్వాయర్ ఎర్త్‌బండ మెయిన్ కట్ట దిగువన ఎడమ కాలువకు సంబంధించి సుమారు 20 ఎకరాల భూమినిఎటోర్ సిటీ అనే రియల్‌ఎస్టేట్ సంస్థ ఆక్రయించి వెంచర్ వేసిన నేపథ్యంలో ఆ భూమిని గుర్లగెడ్డ ప్రాజెక్టు సాధన కమిటీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో రియల్ ఎస్టేట్ దందా పెరిగిపోయిందని, ఎక్కడపడితే అక్కడ బంజరు, ప్రభుత్వ భూములు, ప్రాజెక్టుల కింద మిగులు భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్ను పడిందని అన్నారు. గుర్లగెడ్డ ప్రాజెక్టు పరిధిలో భూమిని ఆక్రమించి మట్టిని తరలించి వెంచర్లు ఏర్పాటు చేయడం దుర్మార్గమని అన్నారు. గత 14 రోజులుగా ఎడమ కాలువ కప్పేసి వెంచర్ వేస్తున్నా ఇరిగేషన్ అధికారులు గాని, రెవెన్యూ అధికారులు పట్టించుకోపోవడం అన్యాయమన్నారు. 27ఏళ్లుగా నిర్మాణం కొనసాగుతున్న గుర్ల గెడ్డ మినీ రిజర్వాయర్‌ను గత పాలకులు, ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ తవ్వకాలు ఇలాగే కొనసాగితే ప్రాజెక్టు ఎడమ కాలువ, మెయిన్ కట్ట మట్టి కొట్టుకుపోయే పరిస్థితి ఉందని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇచ్చిన హామీ నెరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ ప్రాజెక్టు కింద భూములను ఆక్రమించుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న గుర్ల ప్రాజెక్టు మెయిన్ కట్టను ఎడమ వైపు కొండ వరకు పొడిగించాలని, అదనపు నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతుల జిల్లా అధ్యక్షుడు తొత్తల పైడిపు నాయుడు, గుర్ల ప్రాజెక్టు సాధన కమిటీ నాయకులు గంట్రేటి లక్ష్మణరావు, పూర్నాన అప్పలనాయుడు, రెడ్డి రాజప్పలనాయుడు, గంట్రేటి అప్పలనాయుడు, మండల తిరుపతిరావు, బొద్దల జగదీష్, చలు మూరి రామ్మూర్తి, గొర్లె సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువ పూడ్చివేతపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి కథనానికి స్పందన

గుర్ల గెడ్డ ప్రాజెక్టు ఎడమ కాలువ అక్రమణపై రెవెన్యూ యంత్రాంగం కదిలింది. మెంటాడ డిప్యూటీ తాహశీల్దార్ నాయకత్వంలో మండల సర్వేయర్, విఆర్ఒ, గుర్ల తమ్మి రాజుపేట సర్వేయర్ కలిసి గుర్ల గెడ్డ సాగునీటి ప్రాజెక్టు పరిసర ప్రాంతంలోని ఎడమ కాలువను మంగళవారం పరిశీలించారు. కాలువ పూర్తి చేసి... ప్లాట్లుగా మలిచి అనే శీర్షికతో ఈనెల 15వ తేదీన ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం వెలువడిన సంగతి తెలిసిందే. . దీనిపై జిల్లా కలెక్టర్ రామ సుందర్ రెడ్డి ఆరా తీశారు. క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. స్పందించిన రెవెన్యూ యంత్రాంగం మంగళవారం హుటాహుటిన కాలువను పరిశీలించారు. అయితే, కాలువ, ప్లాట్లు ఉన్న రెవెన్యూ పరిధి అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్నట్లు గా గుర్తించారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక పంపారు, మరోవైపు ప్రాజెక్టు డిఇ అనంతగిరి మండల తాహశీల్దార్‌కు లేఖ రాశారు.

ట్రైనీ కానిస్టేబుళ్లకు మౌలిక వసతులు : డిఐజి

ప్రజాశక్తి-కంటోన్మెంట్




సారిపల్లి డిపిటిసిలో వసతులను పరిశీలిస్తున్న డిఐజి గోపీనాథ్ జట్టి

సారిపల్లి డిపిటిసి, విజయనగరం 5వ బెటాలియన్‌లో బిటిసిలకు శిక్షణకు రానున్న ట్రెయినీ కానిస్టేబుళకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని వసతులూ కల్పిస్తున్నట్లు విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. మంగళవారం ఆయన సారిపల్లిలోని శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. తరగతి గదులు, వంట, వాష్ రూమ్స్, పరేడ్ గ్రౌండు, ఫైరింగు రేంజ్, వాటర్ ప్లాంట్, డైనింగు హాల్స్, కంప్యూటరు ల్యాబ్ను స్వయంగా పరిశీలించారు. శిక్షణకు వచ్చే కానిస్టేబుళ్లకు క్రమశిక్షణతో కూడిన ఉత్తమ శిక్షణను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. శిక్షణ కేంద్రంలో మంచాలు, పరుపులు, క్రీడా సామగ్రి, టేబుల్స్, కంప్యూటర్లు, ఫ్యానులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. వంటశాలను, డైనింగు హాలును పరిశీలించి, పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, శిక్షణ ఇచ్చేందుకు నియమించబడిన పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు చేసారు. డిఐజి వెంట అదనపు ఎస్‌పి పి. సౌమ్యలత, 5వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్, విజయగనరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, డిపిటిసి డిఎస్‌పి ఎం. వీరకుమార్, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, పలువురు సిఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

సహకార సంఘాలు ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు పి.కామేశ్వరరావు, రామానాయుడు, నారాయణరావు మాట్లాడుతూ జీవో నెంబరు 36ను వెంటనే అమలు చేసి డి.ఎల్.ఎస్.ఎస్ ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులకు ఐదేళ్లకొకసారి వేతన సవరణ చేయవలసి ఉండగా 2019, 2024లో చేయలేదని, వెంటనే పెండింగ్‌లో వున్న వేతన సవరణలు చేయాలని, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యుటీ సీలింగ్ విధించి 2 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. గ్రాట్యుటీ చట్టాన్ని అమలుపరిచి చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపులు చేయాలని కోరారు. ఉద్యోగి సర్వీస్‌లో మరణిస్తే ఆ కుటుంబం ఆధారం లేకుండా పోతున్నందున ప్రతి ఉద్యోగికి 20లక్షలు టర్మ్ ఇన్సూరెన్సు పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. ధర్నా లో నాయకులు సత్యన్నారాయణ,సర్వేశ్వరరావు ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగార్జునకే మళ్లీ పట్టం

జిల్లా అధ్యక్షులుగా కిమిడి నియామకం

ప్రజాశక్తి-విజయనగరంకోట



ముఖ్యమంత్రి చంద్రబాబుతో నాగార్జున

టిడిపి విజయనగరం జిల్లా అధ్యక్షులుగా కిమిడి నాగార్జున మరోసారి నియమితులయ్యారు. కొంతకాలంగా టిడిపి జిల్లా అధ్యక్షుని నియామకం విషయంలో జరుగుతున్న చర్చకు తెరదించుతూ అధిష్టానం మంగళవారం జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. అధ్యక్ష పదవిని పలువురు నాయకులు ఆశించినప్పటికీ మళ్లీ నాగార్జున వైపే పార్టీ నాయకత్వం మొగ్గు చూపింది. నాగార్జున డిసిసిబి చైర్మన్‌గా వ్యవహరిస్తుండటంతో ఈసారి మరొకరికి అవకాశం కల్పిస్తారని జోరుగా చర్చ నడిచింది. అందులో భాగంగానే పలువురి పేర్లు అధిష్టానం పరిశీలనకు వెళ్లాయి. అయితే అధిష్టానం నాగార్జునపైనే మరోసారి నమ్మకం ఉంచింది. వరుసగా రెండోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. పార్టీలో అంకితభావం, కష్టపడేతత్వం, అందరినీ కలుపుకొని పోయే మనస్తత్వం, పార్టీని ఏకతాటిపై నడిపే సమర్థత ఉన్న యువ నాయకుడు నాగార్జునకే ముఖ్యమంత్రి చంద్రబాబు, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాధ్యతలు అప్పగించారని నాయకులు అంటున్నారు. మాజీ మంత్రి కిమిడి మృణాళిని, గణపతిరావుల కుమారుడైన కిమిడి నాగార్జున.. ఉన్నత చదువులు చదివారు. ఎంఎస్ పూర్తి చేసి, చాలా కాలం అమెరికాలో ఉద్యోగం చేశారు. రాజకీయాలపై ఆసక్తితో ఉద్యోగాన్ని వదులుకొని 2015లో ఇక్కడికి వచ్చారు. అప్పట్లోనే రాజకీయ రంగ ప్రవేశం చేసినా.. 2019లో తొలిసారిగా చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా టిడిపి తరుపున పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ చేతిలో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ వైసిపి వైఫల్యాలను ఎండగడుతూ పార్టీని ముందుకు నడిపించారు. ప్రజా సమస్యలపై పార్టీ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే 2020లో పార్టీ అధిష్టానం ఆయనను టిడిపి విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షునిగా నియమించింది. 2024లో జరిగిన ఎన్నికల్లో కొన్ని కారణాల రీత్యా నాగార్జునకు చీపురుపల్లి అసెంబ్లీ టికెట్ రాలేదు. అయినప్పటికీ, తను నమ్మిన కార్యకర్తలకు అండగా నిలవాలన్న సదుద్దేశంతో నాగార్జున.. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆయన పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా డిసిసిబి చైర్మన్‌గా నామినేటెడ్ పదవి దక్కింది. ఈనేపథ్యంలో జిల్లా అధ్యక్ష పదవికి పలువురు నాయకులు పోటీ పడినప్పటికీ మళ్లీ నాగార్జుననే అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్‌కు నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు.

శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు, ప్రభుత్వ వైద్య కళాశాలకు పోలికా?

మంత్రి అవగాహన రాహిత్య వాఖ్యలకు నిదర్శనం

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ప్రజలకు ఉపయోగపడే వైద్య కళాశాలలను శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌తో పోల్చడం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అవగాహన రాహిత్యానికి నిదర్శనమని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజల సాక్షిగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రజాఉద్యమం విజయవంతమైందన్నారు. ఉచిత విద్య, వైద్యం పొందే హక్కు ప్రజలకు ఉందని, అటువంటి విద్యను కూటమి ప్రభుత్వం కార్పోరేట్లకు ధారాదత్తం చేస్తుంటే ప్రతిపక్షంగా వైసిపి చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. అందులో భాగంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రజలు రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి సంతకాలు చేసి తమ అభిప్రాయాన్ని స్పష్టం చేశారన్నారు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించకుండా ఈ జిల్లా మంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామన్న మంత్రి మాటలు అసత్యాలని అన్నారు. రాష్ట్రంలో 13 శాఖలకు చెందిన ఉద్యోగులకు 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జీతాలు వేస్తున్నారని ఆధారాలతో సహా చూపించారు. ఇప్పటికైనా ప్రజల కోసం పని చేయాలని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం మార్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శులు కెవి సూర్యనారాయణ రాజు, నెక్కల నాయుడు బాబు జిల్లా ఉపాధ్యక్షులు సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, జిల్లా ప్రచార కమిటీ విభాగం అధ్యక్షులు వల్లి రెడ్డి శ్రీను , జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి అయిదేళ్ల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయవచ్చని తెలిపారు. మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో పల్స్ పోలియో కార్యక్రమం శతశాతం విజయవంతం కావాలని చెప్పారు. ప్రయాణాలలో ఉన్నవారు, ఇతర పనులపై వేరే ప్రాంతాలకు వెళ్ళిన వారు ఆయాచోట్ల ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను అడిగి తెలుసుకుని అక్కడ పిల్లలకు చుక్కలను వేయించాలని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక మోనటరింగ్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఎఇ సీతారామమూర్తి పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ సందర్శన

వంగర: స్థానిక పోలీస్ స్టేషన్‌ను చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం సందర్శించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోక్స్ కేసులు, ఎస్‌సి, ఎస్‌టి కేసులు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వంగర ఎస్.ఐ షేక్ శంకర్ పనితీరు, రికార్డులు నిర్వహణపై డిఎస్‌పి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్రరావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

డెంకాడ: నువ్వు పంటలో రైతలు యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏరువాక కేంద్ర సమన్వయకర్త కెల్ల లక్ష్మణ్ అన్నారు. విజయనగరం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని దొడ్డిబాడువ గ్రామంలో షెడ్యూల్ కుల ఉపప్రణాళికలో భాగంగా రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడతూ నువ్వులు దిగుబడి పెంచడానికి అవసరమైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. అనంతరం రైతులకు నువ్వు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం సహ సంచాలకులు నాగభూషణం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సలహా మండలి సభ్యులు కేవీ సూర్యనారాయణ రాజు, ఎఒ టి.సంగీత, రైతులు పాల్గొన్నారు.

సోంపురంలో అన్నదానం

వేపాడ: మండలంలోని సోంపురం అభయాంజనేయ స్వామి ఆలయ ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సర్పంచ్ మురిపిండి గంగరాజు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

రేగిడి: మండల కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులకు డాక్టర్ కంట సందీప్‌కుమార్ మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ ఫిజియోథెరపీని ఎంఇఒ వర ప్రసాదరావు పరిశీలించారు. విభిన్న అవసరాలు గల వికలాంగ విద్యార్థులు హాజరయ్యారు. వైద్యులు చెప్పిన సూచన మేరకు ఫిజియోథెరపీ ఇంటి వద్ద తల్లిదండ్రులు రెండు పూటలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల భవిత కేంద్ర టీచర్స్ మహేశ్వరీ, రాజేష్ ఉన్నారు.

అదనపు ధాన్యం తీసుకోవడం ఆపండి

తెర్లాం: రైతుల నుంచి మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకోవడం వెంటనే ఆపాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి గోపాలం, సభ్యులు పెంకి రామారావు డిమాండ్ చేశారు. మంగళశారం సతివాడ గ్రామంలో పెంకి రామారావు 115 క్వింటాలు నెమలాం వద్ద ఉన్న రైస్ మిల్లుకు తీసుకొని వెళితే 110 క్వింటాలకే లెక్క కట్టినట్లు తెలిపారు. 5 క్వింటాలు అంటే సుమారు 12 వేల రూపాయలు నష్టపోయినట్లు తెలిపారు. ఈ విధంగా మండలంలో రైతుల వద్ద 5 నుండి 6 కేజీల వరకు తీసుకుంటున్నారని చెప్పారు. అనేక కష్టాలకు, నష్టాలకు ఓర్చి పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తే ధాన్యం ముక్కలవుతున్నాయని అదనంగా తీసుకోవడం అన్యాయమన్నారు. అధికారులు రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం డిటి సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి శంకర్రావు రైతులు పాల్గొన్నారు.

నిస్సహాయులకు అండగా కారుణ్య సంస్థ

బొబ్బిలి: నిస్సహాయులకు అండగా ఉంటూ ప్రేమ కలిగి ఉండటమే సేవ పరమార్థం అని కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జె సి రాజు అన్నారు. మంగళవారం స్థానిక కారుణ్య కార్యాలయంలో బొబ్బిలి పట్టణం దావాల వీధికి చెందిన సత్యన్నారాయణ వృద్ధ దంపతులు కుటుంబ పోషణకు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో తక్షణమే స్పందించిన జెసి రాజు రూ.5వేల నగదుతో పాటు దంపతుల ఇరువురుకు నూతన దుస్తులు అందించి తన ఉదారతను చాటుకున్నారు. అదే వీధికి చెందిన ఈశ్వరమ్మ గత 6 నెలలుగా పక్షవాతంతో బాధపడుతూ లేవలేని స్థితిలో ఉందని, తన భర్త అభ్యర్థన మేరకు రూ.5 వేలు విలువ చేసే డయాపర్స్‌ను ఉచితంగా అందించారు.

రయింద్రం, గిట్టుపల్లి రోడ్డు పనులు పరిశీలన

బొండపల్లి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో రైంద్రం-గిట్టుపల్లి బి.టి రోడ్‌కు మోక్షం లభించింది. సుమారు రెండు కోట్ల ఉపాది హామీ నిధులతో సుమారు రెండు కిలోమీటర్ల మేర బిటి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రోడ్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. అయితే ఇటీవల బొండపల్లి మండల పరిషత్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఈ సమస్యను రైంద్రం-గిట్టుపల్లి గ్రామాల పెద్దలు మంత్రి కొండపల్లి దృష్టికి తీసుకు వెళ్లారు. తక్షణం స్పందించిన మంత్రి కొండపల్లి ఉన్నత దికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో రోడ్ నిర్మాణ పనులలో కదలిక వచ్చింది. ఈ మేరకు మండల పంచాయతి రాజ్ ఎఇ పి.అప్పలనాయుడు మంగళవారం బిటి రోడ్ పనులను పరిశీలించారు. ఈయన వెంట రైంద్రం గ్రామ సర్పంచ్ ముదునూరు శ్రీనివాసరాజు, గిట్టుపల్లి గ్రామ టిడిపి సీనియర్ నాయకులు పల్లి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

దత్తిరాజేరు: స్పందన చేయూత ఫౌండేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో కీర్తిశేషులు మహాదేవ సాంబమూర్తి మాస్టర్ కుమారుడు మహాదేవ కృష్ణమూర్తి దంపతులు దత్తి రాజేరు గ్రామంలో ఉన్న వృద్ధులకు మంగళవారం చలికి ఉపయోగ కోసం దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. స్పందన ఫౌండేషన్ ద్వారా వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని చేయూత ఫౌండేషన్ అధ్యక్షులు బుచ్చిరాజు తెలిపారు. విద్యా, మెడికల్, గిరిజన ఆశ్రమంలో ఉన్నవారికి సహాయం చేస్తామన్నారు. గ్రామంలో గవర్నమెంట్ పెన్షన్ అందనీ వారికి స్పందన ద్వారా 500 రూపాయలు ఇస్తున్నామని భవిష్యత్తులో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవ పద్మావతి శంకర్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

విజయనగరం టౌన్ : జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.వాసు డిమాండ్ చేశారు. మంగళవారం స్తానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ నేటి విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి ఒక జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని,ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. రెండేళ్లయినా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా యువతను మోసం చేస్తున్నారన్నారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రభుత్వ శాఖలో ఖాళీగా వున్నా పోస్టులను భర్తీ చేసి యువత కు నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇచ్చి యువతను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు వితరణ

విజయనగరం టౌన్ : గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహం విద్యార్థులకు విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ కుమారి తన కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులతో సమావేశం ఏర్పాటుచేసి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, సివిల్ సర్వీస్ పరీక్షల కోసం ఏ విధంగా సన్నద్ధం కావాలి, ఏ విధంగా ప్రిపేర్ అవ్వాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమ అధికారి వి.సంతోష్ కుమార్, గిరిజన సంక్షేమశాఖ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం

విజయనగరం టౌన్ : విజయనగరం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎఎస్‌ఐగా పని చేస్తున్న అల్లి త్రినాధరావు ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 13,14 తేదీల్లో గుంటూరులో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం, 100 మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ పతకం, షాట్ పుట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఆయనను క్రీడాకారులు, క్రీడా సంఘాల నాయకులు అభినందించారు.

ఆటో స్టాండ్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలని పైడిమాంబ ఆటో కార్మిక యూనియన్ నాయకులు కనకరావు, అప్పలరాజు ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంలో అనేక ఆటోలకు నేటికీ అధికారులు ఆటోస్టాండ్‌లు మంజూరు చేయకపోవడంతో రన్నింగ్ ఆటో డ్రైవర్లుగా ఉంటున్నారని, ప్రస్తుతం అధికారులు ట్రాఫిక్ నిబంధనల పేరుతో ఆటో స్టాండ్ లేని డ్రైవర్లపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఆటో స్టాండ్‌లు పార్కింగ్ స్థలాలు ఇచ్చే బాధ్యతను సంబంధిత అధికారులు విస్మరించి సాధారణ ఆటోడ్రైవర్లను వేధించడం తగదని అన్నారు. అధికారుల వైఖరి మారకుంటే రన్నింగ్ ఆటో డ్రైవర్లను సమీకరించి ఆందోళన చేస్తామని తెలిపారు.

లక్ష్మీపురం పంచాయతీ విభజనపై ఉద్రిక్తత

● గ్రామ సభలో విభజన వద్దని కొందరు... కావాలని మరికొందరు.. ● చివరకు ఓటింగ్‌తో ఓడిన తీర్మానం

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని లక్ష్మీపురం గ్రామపంచాయతీ విభజనకు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం గ్రామ పంచాయతీ పాలకవర్గం, నాయకులు ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. లక్ష్మీపురం పంచాయతీలో అక్కన్నగ్రహారం గ్రామం కలిసి ఉంది. అయితే ఇప్పుడు లక్ష్మీపురం నుంచి అక్కన్నగ్రహారం గ్రామాన్ని వేరు చేసి కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని కొంత మంది కోరుతున్నారు. ఇందులో భాగంగా ఈ గ్రామ సభలో అక్కన్నగ్రహారం గ్రామానికి చెందిన కుదిగాన సత్యనారాయణ తన అనుచరులతో గ్రామపంచాయతీని విభజన చేయాలని, లక్ష్మీపురం గ్రామానికి చెందిన కెంబూరు వెంకటేశ్వరరావు అనుచరులు విభజన చేయవద్దని చెప్పడంతో వీరి మధ్య మాట మాట పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. అక్కన్నగ్రహారం గ్రామ టిడిపి నాయకులు పొదిలాపు సత్యనారాయణ, భాస్కర్ రావు రామినాయుడులతో పాటు లక్ష్మీపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మీసాల చంద్రి నాయుడు, కర్నేన గౌరునాయుడు, శంకర్రావులు గ్రామపంచాయతీని విభజన చేసి అభివృద్ధికి దోహదపడాలని గ్రామసభలో తన వాదనను వినిపించారు. దీనికి వైసిపి సర్పంచ్ కెంబూరు తేజోవతి, వైసిపి నాయకులు వెంకటేశ్వరరావు తన గ్రూపు లక్ష్మీపురం పంచాయతీని విభజన చేయొద్దని తేల్చి చెప్పారు. దీంతో ఇరు వర్గాలు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. పంచాయతీ విభజన చేయాలని



గొడవకు దిగుతున్న ఇరు గ్రూపుల సభ్యులు

సత్యనారాయణ గ్రూపు సభ్యులు పంచాయతీ కార్యదర్శి జగదాంబను తీర్మానం చేసి ఇవ్వాలని కోరగా, విభజన వద్దని తీర్మానం చెయ్యాలని వెంకటేశ్వరరావు గ్రూపు కార్యదర్శిని డిమాండ్ చేశారు. దీంతో కార్యదర్శి చాకచక్యంగా వ్యవహరించి ఇరు గ్రూపులతో తన ఆలోచనను వివరించారు. అక్కన్నగ్రహారం గ్రామపంచాయతీ విభజన కావాలని ఒక గ్రూపు సంతకాలు, విభజన వద్దని ఇంకో గ్రూపునకు సంబంధించి ఓట్ ఆఫ్ సంతకాలు, నిసానీలు తీసుకున్నారు. దీంతో విభజన వద్దని 208 మంది, విభజన కావాలని 109 మంది చేశారు. ఫలితంగా 99 మంది అదనంగా విభజన వద్దు కలిసే ఉందామని చెప్పడంతో గ్రామపంచాయతీ సర్పంచ్ తేజోవ తీర్మానాన్ని తిరస్కరించారు. ఈ సందర్భంగా అక్కన్నగ్రహారం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పోదులాపు సత్యనారాయణ ప్రజాశక్తితో మాట్లాడుతూ అక్కన్నగ్రహారంలో మూడు వార్డులకు సంబంధించి 672 ఓట్లు ఉన్నాయని గ్రామపంచాయతీ విభజన చేస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని కోరుతున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి గ్రామపంచాయతీల విభజన చట్టం తేవడంతో తమ గ్రామానికి అభివృద్ధి పథంలో నడుస్తుందని విభజన చేయమని చెబితే సొంత ప్రయోజనాలకు తీర్మానాన్ని వ్యతిరేకించారని ఆవేదన చెందారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చంద్రరావు, గౌర్నాయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ విభజన చేస్తే అన్ని పంచాయతీల అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఏది ఏమైనా అక్కన్న అగ్రహారాన్ని గ్రామపంచాయతీగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్ వద్దకు ఈ పంచాయతీని తీసుకువెళ్తామని టిడిపి నాయకులు చెప్పారు.

వెంకటాపురం నుంచి అంబాడ గ్రామాన్ని విభజించండి

మండలం అంబాడ వెంకటాపురం గ్రామపంచాయతీ నుంచి అంబాడని విభజన చేయాలని టిడిపి నాయకులు గోగుల తమ్మి నాయుడు, వైసిపి సర్పంచ్ చుక్క వెంకట్ నాయుడు గ్రూపుల మధ్య మంగళవారం వాదన జరిగింది. అంబాడ గ్రామాభివృద్ధికి సహకరించి తీర్మానం చేయాలని గ్రామస్తులు కోరగా సర్పంచు తిరస్కరించారు. దీంతో ఇరు గ్రూపుల మధ్య స్వల్ప ఘర్షణ పడ్డారు. పోలీసులు సముదాయించారు. రెండు రోజులు వాయిదా వేసినట్లు కార్యదర్శి శ్యామ్ తెలిపారు.

జిఒ 70పై హర్షం

భోగాపురం: పిల్లల వయస్సుతో సంబంధం లేకుండా చైల్డ్ కేర్ లీవ్ వినియోగించుకొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జిఒ నెంబర్ 70 ఉతర్వులు జారీ చేయడం మంచి పరిణామమని ఎన్‌జిఒ భోగాపురం తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఉద్యోగి సర్వీస్ మొత్తంలో 10 సార్లుతో పాటు పిల్లల వయసు నిబంధన ఉండేదని ఇలా 180 రోజులు వినియోగించుకునే అవకాశం ఉండేదని ఇప్పుడు పిల్లల వయసుతో సంబంధం లేకుండా ఉద్యోగి రిటైర్ అయ్యేలోపు మహిళలు, ఒంటరి పురుష ఉద్యోగులు ఎన్నిసార్లు అయినా ఈ చైల్డ్ కేర్ సెలవులు వినియోగించుకొనే విధంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారిచేసిందన్నారు.

బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దుదాం

మెరకముడిదాం: బాల్య వివాహ రహిత మండలంగా మెరకముడిదాంను తీర్చిదిద్దుతామని సిడిపిఒ పి. నాగమణి అన్నారు. మండల స్థాయి బాల్య వివాహ నిషేద అధికారుల సమావేశం మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంఛార్జి ఎంపిడిఒ సుధాకర్ పట్నాయక్, పిహెచ్‌సి వైద్యాధికారి బి.పూజ, ఎన్‌జిఒ ఝాన్సి, ఐసిడియస్ సూపర్‌వైజర్లు టి.శ్రీదేవి, కృష్ణవేణి, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు విధుల బహిష్కరణ

మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని మంగళవారం పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించారు. ఆరు నెలలుగా ఉద్యోగాలు కోసం మున్సిపల్ కమిషనర్‌ను కలుస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని విధులు బహిష్కరించి ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. శంకరరావు మాట్లాడుతూ చనిపోయిన, రిటైర్ అయిన పారిశుధ్య కార్మికుల 3 కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని నెలలు తరబడి వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం చేయడం లేదన్నారు. డబ్బులు ముట్ట చెబితే మాత్రం కొత్త ఉద్యోగాలు ఇస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు యూనిఫారం, చెప్పులు, సబ్బులు ఇవ్వాలని ఎన్నిసార్లు చెప్పినా కౌన్సిల్ తీర్మానంలో పెట్టడం లేదన్నారు. జనరల్ ఫండ్‌లో చేసిన, చెయ్యని పనులకి లక్షల రూపాయలు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. పారిశుధ్య కార్మికులు డోర్ టు డోర్ చెత్త సేకరిస్తునాన చెత్త వాహనాలు పాడైపోవడంతో బాగు చేయాలని అడిగితే మీరే చేతి డబ్బులు పెట్టి బాగు చేసుకోండి అని చెప్తున్నారని ఇంతకంటే అన్యాయం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో గతంలో 9 చెత్తను తరలించే వాహనాలు ఉండేవని, ఇప్పుడు రెండు మాత్రమే పని చేస్తున్నాయని అన్నారు. కార్మికులు చెత్త సేకరించి వాహనాలు సకాలంలో రాక



ఎమ్మెల్యేకు వినతి పత్రాన్నిస్తున్న నాయకులు,కార్మికులు

వీధుల్లో సేకరించిన చెత్త ఒక దగ్గర దిబ్బ వేస్తే ప్రజలు అంగీకరించడం లేదన్నారు. మున్సిపాలిటీలో అక్రమాలు జరుగుతున్నా నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చి అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తామని, సమస్యలపై అదేరోజు చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరాన్ని సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముంజేరు గ్రామ పరిధి సిద్దార్థ కాలనీకి చెందిన దళిత మహిళలు తమకు న్యాయం చేయాలంటూ గత పదకొండు రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. తమ కాలనీ పక్క నుంచి మురికి కాలువను దౌర్జన్యంగా నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో అడ్డుకున్న దళిత మహిళలపై అగ్రవర్ణ కులస్తులు దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక మండలపరిషత్ కార్యాలం ఎదురుగా గత కొన్ని రోజులనుంచి నిరాహారదీక్ష చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం డిఎస్‌పి ఆర్. గోవిందరావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మహిళలతో మాట్లాడారు. ఈ కేసులో తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే నోటీసులు ఇచ్చామని మీకు తగిన న్యాయం జరుగుతుందని దీక్షను విరమించాలని కోరారు. దీనిపై దళిత మహిళలు స్పందిస్తూ, తమపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసిన తర్వాతే దీక్ష విరమిస్తామని స్పష్టం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోనే వరకూ ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు పాపారావు, సూర్యకళ పాల్గొన్నారు.



దీక్షలో మహిళలతో మాట్లాడుతున్న డిఎస్‌పి

వసతిగృహం సందర్శించిన డిఎస్‌పి

డెంకాడ: విద్యార్థులతో ముఖాముఖిలో భాగంగా మంగళవారం విజయనగరం డిఎస్‌పి ఆర్ గోవిందరావు మెర్సీ మిషన్ స్కూల్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్వాలిటీ ఫుడ్, సీసీ కెమెరాల వర్కింగ్, పరిసరాలు సక్రమంగా ఉండేలా స్టూడెంట్స్‌కు ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే క్విక్ రెస్పాండ్ అయ్యేలా ఉండమని స్కూల్, హాస్టల్ మేనేజ్మెంట్‌కి సూచించారు. అనంతరం యాక్సిడెంట్ జోన్ ఏరియాస్ సందర్శించి తీసుకోవాల్సిన రోడ్ సేఫ్టీ స్టెప్స్ గురించి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి- గంట్యాడ

తమ ఉద్యోగాలను నిర్వర్తించడానికి ప్రతి గ్రామ కార్యదర్శి అవగాహన కలిగి ఉండాలని మండల స్పెషల్ అధికారి శ్రీనివాస్ పాణి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు కొత్త విషయాలను నేర్చుకుని విధులను నిర్వహించాలన్నారు. తమ కింద ఉన్న 11 మంది సిబ్బందితో ప్రతిరోజు ఆఫీసులో చర్చించుకుని ఎవరి పనిని వారు చేసుకున్నప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని గ్రామ ప్రజలు మీపై అభిమానంతో ఉంటారని అన్నారు. 91వ జీవోను చదివి ప్రతి విషయాన్ని తెలుసుకోవాలన్నారు. వీధిలైట్లు, తాగునీరు,



మాట్లాడుతున్న శ్రీనివాస్ పాణి

రోడ్లు, కాలువల నిర్మాణం పారిశుధ్యం పనులను ఎప్పటికప్పుడు చేయించి గ్రామాన్ని ఆరోగ్యవంతంగా ఉంచాలన్నారు. గ్రామంలోని పన్నులను వసూలు చేసి జనరల్ ఫండ్‌ను ఉపయోగించి ప్రజా సమస్యలను పరిష్కారం చేయడానికి కృషి చేయాలన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని కె.సీతారాంపురం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బాధితులకు లక్ష్మీ గణపతి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఎన్ బూర్జవలస గ్రామ సర్పంచ్ పైల గణపతి రావు (గణేష్) మంగళవారం బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ముందుగా అగ్ని పమాదంలో మరణించిన పాపమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రతి కుటుంబానికి రూ.2500 నగదు, మంచాలు, దుప్పట్లు, చీరలు, నిత్యవసర వస్తువులు అందించారు. అనంతరం పెద్ద గొలుగువలస గ్రామానికి చెందిన రైతుల గడ్డి కుప్పలు, ధాన్యం కాలిపోవడంతో నలుగురు రైతులకు ఐదువేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు టి.సత్యంనాయుడు, నర్సిపల్లి బాబ్జీరావ్, వైస్ ఎంపిపి సత్యనారాయణ, మాజీ ఎఎంసి చైర్మన్ బొమ్మ శ్రీనివాసరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి జి.రామారావు, ఆ గ్రామ ఎంపిటిసి సాకేటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలసలోని గురుకులంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ (డివియంసి) సభ్యులు మజ్జి గణపతి అన్నారు. కష్టం వస్తే ఎవరితో చెప్పుకోవాలో అనే కథనం ఈనెల 15న ప్రజాశక్తిలో రావడంతో ఈ మేరకు ఆయన స్పందించి మంగళవారం గణపతి తోపాటు దళిత బహుజన జెఎసి నాయకులు మడ్డువలస గురుకులానికి వెళ్లి ప్రిన్సిపాల్ జంప రాధిక, విద్యార్థినిలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. అక్కడ ప్రధానంగా హెల్త్ సూపర్వైజర్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామన్నారు. చిన్న, చిన్న సమస్యలు ఉన్నాయని వీటిని పరిష్కరించేందుకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల జెఎసి నాయకులు గంగులు, యం.రాంబాబు, చంటి, పాల్గొన్నారు.

హెల్త్ సూపర్వైజర్ నియామకం

ఈనెల 15న ప్రజాశక్తిలో కష్టమొస్తే ఎవరితో చెప్పుకోవాలో అనే కథను ప్రచురణ కావడంతో జిల్లా అధికారులు స్పందించి మడ్డువలస గురుకులంలో ఖాళీగా ఉన్న హెల్త్ సూపర్వైజర్ పోస్ట్ స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లాలో గల గరుగుబిల్లి గురుకులంలో గల హెల్త్ సూపర్వైజర్ సిహెచ్ స్వర్ణలతను మడ్డువలస గురుకులానికి డిప్యూటేషన్‌పై వేయడంతో ఆమె మంగళవారం అక్కడకు హాజరయ్యారు.

చీడివలసలో పొలం పిలుస్తోంది..

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలో చీడివలస గ్రామంలో రబీ సీజన్‌లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మినుములు, పెసలు పంటలో మెళుకువలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయాధికారి కెవి రామ్‌ప్రసాద్ రైతులకు తెలిపారు. పంటలకి రసాయనాలను పురుగుల మందులను తగ్గించి సేంద్రియ, కృత్రిమ ఎరువులపై దృష్టి పెట్టి ఎన్నో ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ గణేష్, నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఎపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

ప్లాస్టిక్ అమ్మకంపై నోటీసులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ గ్లాసులు కవర్లు విక్రయిస్తున్న అమ్మకపుదారులకు చీపురుపల్లి మేజర్ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. పంచాయతీ పరిధిలో ఇటీవల ప్లాస్టిక్ కవర్లు గ్లాసులు వినియోగం ఎక్కువ కావడంతో కాలుష్యం కారణంగా పలువురు రోగాలు పడుతున్నట్లు గుర్తించిన పంచాయతీ పాలకులు ప్లాస్టిక్ వాడకం పైన నిషేధాన్ని విధించారు. ఈ మేరకు ప్లాస్టిక్ అమ్మకపుదారులకు వారం రోజులు వ్యవధి కల్పిస్తూ తమవద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్లను గ్లాసులను నిర్వీర్యం చేయాలంటూ ఆదేశించారు. నోటీసు ప్రాప్తికి స్పందించని అమ్మకపుదారులపైన కాలుష్య నివారణ చట్టం కింద కేసులు నమోదు చేసి అపరాధ రుసుములు విధిస్తామని పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎన్ రామ్మోహన్‌రావు, పంచాయతీ సిబ్బంది వ్యాపారస్తులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా భావితరాల వారు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటారంటూ అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది రాము, ఈశ్వరరావు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నోటీసులు అందిస్తున్న సిబ్బంది


జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో లక్కవరపుకోట మండలంలోని ఏపీ మోడల్ స్కూల్లో మండల కోఆర్డినేటర్ పి వెంకట్రావు, గాడి రవికుమార్, మండల వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 17 పాఠశాల నుండి 173 మంది క్రీడాకారులు అండర్ 14, 17, 19 విభాగాల్లో బాల బాలికలు పాల్గొని తలబడ్డారు. ఈ పోటీలను ఎల్ కోట ఎంఇఒ ప్రారంభించారు. ఇందులో 30 మంది బాలురు, 30 మంది బాలికలు ఎంపికయ్యారు. వీరు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని నియోజకవర్గ కోఆర్డినేటర్ పొట్నూరు శ్రీరాములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి, ఏపీ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి జి లక్ష్మణరావు, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి విజయలక్ష్మి ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్‌కు పవన్ ఎంపిక

గంట్యాడ: ఈ నెల 17 నుంచి 19 వరకు విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీలకు జిల్లా జట్టు తరుపున గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కొర్రా పవన్ ఎంపికైనట్లు పాఠశాల ఫీజికల్ డైరెక్టర్ పివియస్‌యన్ రాజు తెలిపారు. విద్యార్థి పవన్‌ను వ్యాయామ ఉపాధ్యాయుడు పివియస్‌యన్ రాజుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలమండ ఝాన్సీ అభినందించారు.



పీడీ రాజుతో పవన్



నెల్లిమర్ల: గెలిపొందిన క్రీడాకారులు

స్పోర్ట్స్ మీట్‌లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల: జిల్లా స్థాయి బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మంగళవారం మేరా యువభారత్ - విజయనగరం ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వాలీబాల్, సెటిల్ బ్యాడ్మింటన్, రన్నింగ్ విభాగంలో ప్రథమ బహుమతులు సాధించారు. వాలీబాల్ పోటీల్లో కె.బికును, బి. నాని, బి.అంతి పాషా, బి.ప్రేమ్ కుమార్, ఎ. సింగ్ రాజు, ఎం. టైసన్, టి.గణేష్, షటిల్ బ్యాడ్మింటన్‌లో ఆర్.నితిన్, ఎ.శ్రీను, రన్నింగ్ గర్ల్స్ విభాగంలో పి.సంధ్యారాణి, రన్నింగ్ బాలుర విభాగంలో పి.ప్రేమ్ కుమార్ ప్రథమ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17నుంచి చేపట్టనున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పటిష్టత్మకంగా ఈ నెల 15 నుంచి జనవరి 12 లోగ సర్వేను పూర్తి చేయాలని మున్సిపల్ టిపిఆర్ఒ ఎం.జగన్మోహన్ ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు సరైన అర్హులకు అందించుటకు సర్వే చేసి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు జారీ చేయనున్నట్లు చెప్పారు. సర్వేలో కుటుంబ సభ్యుల అందరూ ఆధార్, మొబైల్, విద్య, ఉపాధి, ఆదాయం, ఆస్తులు, గృహ వివరాలు, సామాజిక, కుటుంబ మ్యాపింగ్ సమాచారం అడిగి తీసుకుని సర్వేలో నమోదు చేయాలన్నారు.

మాస్టర్ ట్రైనర్ రెడ్డి అశోక్ మాట్లాడుతూ సర్వేకి సంబంధించిన యాప్‌ను ప్లేస్టోర్ నుండి డౌన్లోడ్ చేసి కుటుంబ సభ్యుల బేసిక్ ప్రొఫైల్, సోషల్ ప్రొఫైల్, ఎడ్యుకేషన్, స్కిల్లింగ్ ఎంప్లాయిమెంట్, లైవ్లీహుడ్ అనే అంశాలపై సమగ్ర సమాచారం సేకరించి నమోదు చేయాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయం పర్యవేక్షణ అధికారి డి. త్రినాథరావు, జగదీష్ భాగ్యలక్ష్మి, అడ్మిన్ సెక్రెటరీలు, వెల్ఫేర్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

పాత సమస్యలే ప్రస్తావన

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాత సమస్యలే మరోసారి ప్రస్తావనకు వచ్చాయి. ఎప్పటి మాదిరిగానే గృహ నిర్మాణ సంస్థ పనితీరుపైన, మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పనితీరుపైన, మారిక విద్యుత్తు సమస్య పైన సమావేశంలో చర్చించారు. ఎంపిపి డి. సత్యవంతుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు పాల్గొని మాట్లాడారు. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు శాఖల పరంగా సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జె.రాములమ్మ, మాజీ డిసిసిబి చైర్మన్ చినరామునాయుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి రవికుమార్, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.